స్థానిక సంస్థల ఆదాయం పెంచాలి

- ఆ దిశగా కసరత్తు చేయాలి
- సమీక్షలో ఎస్ఎఫ్‌సీ చైర్మన్ రాజయ్య సూచన

సమావేశంలో పాల్గొన్న ఎస్ఎఫ్‌సీ చైర్మన్ రాజయ్య, సెక్రటరీ స్మితా సబర్వాల్, ఇతర అధికారులు

కరీంనగర్ రాంనగర్, జూలై 23 : స్థానిక సంస్థల ఆదాయం పెంచే దిశగా అధికారులు కసరత్తు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పలు శాఖల అధికారులతో 'స్థానిక సంస్థల విధులు-బాధ్యతల'పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపై మాత్రమే ఆధారపడకుండా ఆదాయ మార్గాలు పెంచుకునే అవకాశాలను స్థానిక సంస్థలు సృష్టించుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులు సక్రమంగా వినియోగమయ్యే విధానంపై అధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాలన్నారు. ఎప్పటికప్పుడు వాటిపై ఆడిట్ నిర్వహిస్తూ, అన్ని రంగాలతో పాటు ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. జిల్లాకు అన్ని అంశాలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఐఏఎస్ అధికారి కలెక్టర్‌గా పనిచేస్తుండడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. దేశ పునర్నిర్మాణంలో బ్యూరోకాట్ల పాత్ర కీలకమన్నారు.

ఎస్ఎఫ్‌సీ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ, స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో ఫైనాన్స్ కమిషన్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలకు సేవ చేయడం గొప్ప అనుభూతినిస్తుందని, కరీంనగర్ గడ్డ తనకెంతో ఇష్టమని పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ, ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలని సూచించారు.

కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. స్వశక్తి మహిళా సంఘాలు అప్పగించిన పనులు దిగ్విజయంగా పూర్తి చేస్తున్నారని కితాబునిచ్చారు. మహిళలను కోటీశ్వరులు చేసే కార్యక్రమంలో భాగంగా ముందుకెళ్తున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఎం రమేశ్, సంకెపల్లి సుధీర్‌రెడ్డి, మాలోత్ నెహ్రూ, రామగుండం మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం చంద్రకళ, రాయికల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పెద్దపల్లి అదనపు కలెక్టర్ అరుణశ్రీ, కరీంనగర్ అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీపీవో రవీందర్, జడ్పీ సీఈవోలు శ్రీనివాస్, గౌతంరెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ఆర్డీవోలు, డీపీవోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ చైర్మన్, కార్యదర్శికి పూలమొక్కలతో స్వాగతం

కలెక్టరేట్, జూలై 23 : రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు పూలమొక్కలు అందించి, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు వారు వచ్చారు. గతంలో వీరిద్దరూ ఉమ్మడి జిల్లాలో ఉన్నతాధికారులుగా పనిచేశారు. ఆర్థిక సంఘం చైర్మన్‌గా, కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా కరీంనగర్‌కు రాగా, వీరిని పలు శాఖలకు చెందిన అధికారులు ఆత్మీయంగా స్వాగతించారు. కాగా, ఎస్ఎఫ్‌సీ కార్యదర్శి స్మితాసబర్వాల్ ఉమ్మడి జిల్లాలో కలెక్టర్‌గా ఉన్న సమయంలో పనిచేసిన కొంతమంది అధికారులు ప్రస్తుతం జిల్లాలో విధులు నిర్వహిస్తుండగా, ఆమె వారిని గుర్తుపట్టి పేరుపేరునా పలుకరించడంతో ఆ అధికారులు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

దోపిడీ దొంగల అరెస్ట్

- నిందితులిద్దరూ విద్యార్థులే

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాంనగర్, జూలై 23: నగరంలోని కట్టరాంపూర్ ప్రాంతంలో ఈ నెల 15న తెల్లవారుజామున నాలుగు గంటలకు ద్విచక్ర వాహనదారుడిని వెంబడించి దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితులు ఇద్దరూ విద్యార్థులేనని ఏసీపీ నరేందర్ మీడియాకు వెల్లడించారు. ఈ నెల 15న కట్టరాంపూర్ ప్రాంతంలో బోనాల పండుగకు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తున్న పిట్టల సుమంత్ తిరుమల నగర్ చేరుకునేసరికి యాక్టివా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు అతడి మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో బాధితుడు సుమంత్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయడంతో పాటు నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పరిసర ప్రాంతాల్లో గల సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించి నిందితులను గుర్తించారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఉజ్వల పార్క్ సమీపంలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా బంగారు గొలుసు లభ్యమైంది. దానిని దోపిడీకి పాల్పడిన సొత్తుగా అంగీకరించారు. సదరు వ్యక్తులను హైదరాబాద్ హకీంపేట చెందిన బీటెక్ విద్యార్థి మహ్మద్ ఫైజాన్, మానకొండూర్‌కు చెందిన షేక్ సాహిద్‌గా గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి ద్విచక్ర వాహనం, రెండున్నర తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో శ్రమించిన వన్ టౌన్ సిబ్బంది బషీర్, కుమారస్వామికి ఏసీపీ నగదు రివార్డు అందజేసి అభినందించారు.

నేడు కేటీఆర్ జన్మదిన వేడుకలు

చొప్పదండి/ సైదాపూర్, జూలై 23: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే సైదాపూర్ మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్నట్లు వేడుకలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, SHANEGARAPU KUMMARE NARSAIAH, S/o. SHANEGARAPU KUMMARE RAJAIAH (Old name) R/o. H.No.1-1-82, Kummariwada, Gambhiraopet (V&M), Siricilla Dist. I have changed my name as SANIGARAPU NARSAIAH S/o. RAJAIAH (New name)
NTZ-340076

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571

'శాతవాహన'లో విజిలెన్స్ విచారణ!

కమాన్‌చౌరస్తా, జూలై 23 : శాతవాహన వాహన యూనివర్సిటీపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైనట్లు తెలిసింది. మాజీ వీసీతోపాటు విధులు నిర్వహిస్తున్న కొంతమంది అధికారులు, సిబ్బంది అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయాన్ని పలు విద్యార్థి సంఘాలు ఉన్నత విద్యా మండలి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఎస్‌యూలో వెంటనే విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ఈ విషయంలో సోమవారం ఉదయం నుంచి యూనివర్సిటీ విజిలెన్స్ అధికారులు విడుతలవారీగా విచారణ జరుపుతున్నట్టు తెలుస్తున్నది. అందులో ఏయే అంశాలు ప్రస్తావించారు. ఏయే అంశాలపై అధికారులను విచారిస్తున్నారనే విషయం తెలియాల్సి ఉంది. అయితే, ఇంత జరుగుతున్నా ఉన్నత విద్యా మండలి అధికారులు, ఇటు యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ పూర్తి వ్యవహారంపై ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి నోటీసులు కానీ, ఉత్తర్వులు కానీ వెలువడలేదు.

'తెలంగాణ ఎంపీలు ఏం చేస్తున్నారు?'

హుజూరాబాద్, జూలై 23: కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమని, రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సింగిల్‌విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణకు ఒక్క కేసీఆర్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పదం కూడా లేకపోవడాన్ని ప్రజలు గమనించాలని, దీనిపై బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలను నిలదీయాలని కోరారు.

ఘనంగా శీత్లాభవానీ వేడుకలు

కమాన్‌చౌరస్తా, జూలై 23 : బంజారుల ఆరాధ్య దైవం శీత్లాభవాని వేడుకలను మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్‌లో ఘనంగా జరుపుకొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవార్లను పూజించారు. డివిజన్ నాయకుడు బానోత్ రామ చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈడీ ఆర్ఎంను కలిసిన డీఎం, హాస్పిటల్ డాక్టర్

తెలంగాణచౌక్, జూలై 23: మెట్‌పల్లి డీఎంగా బాధ్యతలు స్వీకరించిన దేవరాజు, ఆర్టీసీ కరీంనగర్ జోనల్ హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్‌గా నియమితులైన డాక్టర్ వసుధ మంగళవారం ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరితను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఇక్కడ డాక్టర్ కార్తిక్ ఉన్నారు.

కరాటే పోటీల్లో పతకాలు

కొత్తపల్లి, జూలై 23 : స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆరాధ్య, తేజ, సుభాష్, అశ్వంత్, రేవంత్‌కుమార్, చరణ్‌తేజ్, ఆయాన్, సుప్రతిక్ హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు, రజత, కాంస్య సాధించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వీరిని పాఠశాల డైరెక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సి.హెచ్. పల్లవి అభినందించారు. అలాగే నగరంలోని వావిలాలపల్లిలోని సెయింట్ పాల్స్ పాఠశాల విద్యార్థులు విశ్వక్ రాజ్, ధీరజ్, శివాని కరాటే పోటీల్లో వివిధ పతకాలు సాధించారని డైరెక్టర్ రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ రక్తదానం

కమాన్‌చౌరస్తా, జూలై 23: ఆపదలో ఉన్న వ్యక్తికి ఎస్ఆర్ఆర్ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం యూనిట్-4 కు చెందిన వలంటీర్ రక్తదానం చేసి ఆదుకున్నాడు. మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి బీ-పాజిటివ్ రక్తం అవసరం ఏర్పడగా, సమాచారం అందుకున్న ప్రోగ్రాం అధికారి ఆదేశం మేరకు బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ మోతీలాల్ రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ, ప్రోగ్రాం అధికారి బీ సురేశ్ కుమార్ వలంటీర్‌ను అభినందించారు.

యాక్టింగ్‌లో ఒక రోజు శిక్షణ

కమాన్‌చౌరస్తా, జూలై 23 : మాస్క్ ఫిలిం ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నటనలో ఆసక్తిగల 6 నుంచి 13 సంవత్సరాల బాల బాలికలకు ఆగస్టు 11న ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఇనిస్టిట్యూట్ చైర్మన్, యాక్టింగ్ కోచ్ అనసూరి భూనాథాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 880156 5909, 94402 15199 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎల్‌వోసీ అందజేత

సైదాపూర్, జూలై 23: మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో సైదాపూర్‌కు చెందిన దాసరి పవన్‌గౌడ్‌కు రూ.2.50లక్షల ఎల్‌వోసీ అందిందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పవన్‌గౌడ్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా, సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి ఎల్‌వోసీ మంజూరు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

షాపులో చోరీ

మానకొండూర్, జూలై 23: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మణికంఠ ఆన్‌లైన్‌సర్వీసెస్ షాపులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపులోని కలర్ ప్రింటర్, రూ. నాలుగువేల నగదు దొంగతనం జరిగిందని షాపు యజమాని కొత్తకొండ రాములు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

కమాన్‌చౌరస్తా, జూలై 23: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో మంగళవారం గంజాయి, మాదక ద్రవ్యాలు, గుట్కాల వాడకంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ చాంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐ రాబర్ట్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

నేడు రాజేశ్వర్‌రావు వర్ధంతి

హుజూరాబాద్, జూలై 23: మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో ఆయన విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, రాజేశ్వర్‌రావు అభిమానులు హాజరుకావాలని కోరారు.

రాయికల్ జలపాతానికి సందర్శకుల తాకిడి

జలపాతం వద్ద సందర్శకులు

సైదాపూర్, జూలై 23: రాయికల్ జలపాతానికి సందర్శకులు తరలివస్తున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కోటగిరి గుట్టల శ్రేణి నుంచి వస్తున్న నీటితో జలపాతం పరవళ్లు తొక్కుతున్నది. కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు చెందిన పర్యాటకులు భారీగా తరలివచ్చి జలపాతాన్ని వీక్షించారు.

న్యాయవాదుల గృహ నిర్మాణ సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నిక

కోర్టుచౌరస్తా, జూలై 23 : జిల్లా కోర్టు న్యాయవాదుల గృహ నిర్మాణ సహకార సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికలు మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆరు ఓపెన్, జనరల్ పాలకవర్గం సభ్యుల కేటగిరీలో నగునూరి పరమేశ్వర్, పోలు వెంకట రాజకుమార్, సింగిరెడ్డి లక్ష్మీరెడ్డి, హరకాల చక్రధర్, దాసరి రామిరెడ్డి, పూరెల్ల రాములు ఎన్నికయ్యారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో ధనుక రాజశేఖర్, ఇద్దరు మహిళా పాలకవర్గ సభ్యుల కేటగిరీలో పొత్తూరి భాగ్యలక్ష్మి, మూల తిరుమల దేవి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సహకార సంఘంలో మొత్తం 341 మంది సభ్యత్వం కలిగి ఉండగా, వారిలోని 288 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీటిలో ఎనిమిది ఓట్లు చెల్లనివిగా ప్రకటించారు.

26న ఉద్యోగ మేళా

కమాన్‌చౌరస్తా, జూలై 23 : జిల్లా కేంద్రంలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈ నెల 26న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి వై తిరుపతి రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐఎఫ్‌బీ సీఎస్ఆర్ డివిజన్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా కౌంటర్ సేల్స్ రిప్రజెంటివ్స్ 100 మందికి అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో పని చేసే అవకాశంతో పాటు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు వేతనం ఉంటుందని వివరించారు. వివరాలకు 92907 51312, 72076 59969 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు

విద్యానగర్, జూలై 23 : వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని, ప్రధానంగా నిరుద్యోగులు, రైతులు, గ్రామీణాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లలో కోటిమంది యువతకు ప్రయోజనం చేకూర్చేలా ఇంటర్న్ షిప్ పథకం, ప్రధానమంత్రి అన్నా యోజన మరో ఐదేళ్ల పొడిగింపు లాంటి అనేక అంశాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

విద్యానగర్, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చిందని బీజేపీ సీనియర్ నాయకుడు సుగుణాకర్ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ.1.53 లక్షల కోట్ల కేటాయింపు, తదితర చర్యలతో దేశం అభివృద్ధి వేగవంతం కానున్నదని పేర్కొన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

సైదాపూర్, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపడం సబబు కాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధులు ఇవ్వాల్సింది పోయి పక్షపాత వైఖరి చూపడం బాధాకరమన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో పేదల ఆశలు ఆవిరి

కలెక్టరేట్, జూలై 23 : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో దేశంలోని పేద ప్రజల ఆశలు ఆవిరయ్యాయని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడానికి బీజేపీ ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ఈ బడ్జెట్ కనిపిస్తున్నదని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పెన్షనర్లకు నిరాశ

కలెక్టరేట్, జూలై 23 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పెన్షనర్లకు నిరాశనే మిగిల్చిందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ ఆదాయంపై పన్ను రద్దు చేయాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నా, కేంద్ర మంత్రి పక్కన బెట్టడం సముచితం కాదన్నారు. స్టాక్ మార్కెట్‌లో కొంత పెట్టుబడి పెట్టే వారికి కూడా దీర్ఘకాల విధానంలో పన్ను పెంచడంతో పెన్షనర్లు తీవ్రంగా మండిపడుతున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

బల్దియా ఇన్‌చార్జి ఎస్ఈగా రాజ్‌కుమార్

కార్పొరేషన్, జూలై 23: కరీంనగర్ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్ఈగా ఈఈ పీ రాజ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో పని చేస్తున్న ఆయనను కరీంనగర్‌కు బదిలీ చేశారు. అలాగే మంచిర్యాలలో పని చేస్తున్న డీఈ టీ శ్రీనివాస్‌ను కరీంనగర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, జూలై 23: బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 5,6 తేదీల్లో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం కరీంనగర్ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు మల్లేశం పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బీసీ నాయకులు రాజ్‌కుమార్, రమేశ్‌పటేల్, రవీంద్రాచారి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

చిగురుమామిడి, జూలై 23: సీతారాంపూర్ గ్రామంలో గోగూరి పోచమ్మ అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మంగళవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య పరామర్శించారు. మృతురాలి కుమారులు వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మురహరి రెడ్డి, కిష్టారెడ్డి, రాజిరెడ్డికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారివెంట గ్రామాధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ఆర్బీఎస్ మాజీ మండలాధ్యక్షుడు తిరుపతి ఉన్నారు.

తిమ్మాపూర్ రూరల్, జూలై 23: మండలంలోని మన్నెంపల్లి, మల్లాపూర్ గ్రామాలకు చెందిన బూడిద లక్ష్మయ్య, కోట ఒదవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు.

అంబేద్కర్ విగ్రహానికి దివ్యాంగుల వినతి

కలెక్టరేట్, జూలై 23 : దివ్యాంగుల మనోభావాలు కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు సద్బుద్ధి కలిగించాలని కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి దివ్యాంగులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ మాట్లాడుతూ, సినిమా డైరెక్టర్ రాజమౌళి కూడా తమను చులకన చేసి మాట్లాడాడని మండిపడ్డారు. చదువుకోని వారంతా వికలాంగులతో సమానమనడం తమను అవమానించడమేనన్నారు. వీరిద్దరి వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని 2016 వికలాంగుల హక్కుల చట్టం 92 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి నందగిరి జగదీశ్వరాచారి, జిల్లా ప్రతినిధులు పి.మనోహర స్వామి, పరశురాం, నాగరాజు, రాజన్న, వెంకటేశ్, కార్తీక్, మహేందర్, రమ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ద్వారా ఉద్యోగావకాశాలు

కలెక్టరేట్, జూలై 23 : జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు డీఆర్‌డీవో వి.శ్రీధర్ తెలిపారు. ఫ్లిప్‌కార్ట్ వేర్ హౌస్‌లో వివిధ స్థాయిల్లో 100 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్సెస్సీ ఆపైన ఉత్తీర్ణులై ఉండి, 19 నుంచి 33 ఏళ్లలోపు గల యువతీ యువకులు ఈ నెల 26న నగరంలోని అంబేద్కర్ స్టేడియం పక్కన గల స్వశక్తి కళాశాలలోని ఈజీఎంఎంఏ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు తమ సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలని సూచించారు. ఎంపికైన వారికి రూ.13వేల నుంచి రూ.16వేల వరకు వేతనం అందుతుందని, మేడ్చల్, పటాన్‌చెరు ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులకు నిర్ణయించిన రూట్లలో ఉచిత క్యాబ్ సౌకర్యం, ఉచిత స్నాక్స్, టీ, కాఫీ, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో డీఆర్‌డీవో స్పష్టం చేశారు.

ఐద్వా రాష్ట్ర స్థాయి సమావేశాలను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

తెలంగాణచౌక్, జూలై 23: నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రాభవనంలో ఈ నెల 26 నుంచి 29 వరకు నిర్వహించనున్న ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర స్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా నిరంతరం పోరాటాలను కొనసాగిస్తున్నదని తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో 13 జిల్లాల్లో న్యాయ సలహా కేంద్రాల ద్వారా బాధిత కుటుంబాలకు అండగా ఉంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ మానవి పత్రిక ద్వారా రాజకీయ ఆర్థిక సామాజికంగా మహిళలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న నాలుగు రోజుల శిక్షణ తరగతుల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ, జిల్లా కమిటీ సభ్యురాలు దేవేంద్ర పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంటల నమోదు

కరీంనగర్ రూరల్, జూలై 23: కరీంనగర్ మండలంలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఏడీఏ రణాధీర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. చెర్లభూత్కూర్, ఇరుకుల్లతోపాటు కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్ గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో సత్యం, ఏఈవో రాజేంద్రప్రసాద్, చెర్లభూత్కూర్, ఇరుకుల్ల సెక్టార్ల ఏఈవో స్వర్ణలత పాల్గొన్నారు.

డీఈని సన్మానించిన మాజీ సర్పంచులు

కరీంనగర్ రూరల్, జూలై 23: పంచాయతీ రాజ్ డీఈ నవీన్ మంథనికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచులు పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జక్కం నర్సయ్య, దబ్బెట రమణారెడ్డి, రుద్ర రాములు, ఉప్పుల శ్రీధర్, మడికంటి మారుతి, చామనపల్లి రాజయ్య, ఊరడి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూలై 23: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ డిమాండ్ చేశారు. నగరంలోని పద్మావతి కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు కనకయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ, బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 31 కరీంనగర్‌లో ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ సభకు అధిక సంఖ్యలో బీసీ వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అంజయ్యగౌడ్, జీఎస్ ఆనంద్, శ్రీనివాస్, బ్రహ్మచారి, సంజీవ్ పాల్గొన్నారు.

బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

తెలంగాణచౌక్, జూలై 23: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70 ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుప్పాల సురేశ్ టవర్‌సర్కిల్‌లో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలను కొనసాగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రావణ్, అరుణ్, ఎండీ సుల్తాన్, శంకర్, రమణ, భాను, నర్సయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు

కరీంనగర్ రూరల్, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా కరీంనగర్ మండలంలోని పని చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు స్థాన చలనం కలిగింది. దుబ్బపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సరిత స్థానంలో సుజాత, చేగుర్తి రాజు స్థానంలో రాజమల్లయ్య, తాహెర్ కొండాపూర్ పంచాయతీ కార్యదర్శి మమత స్థానంలో ప్రవల్లిక, మందులపల్లి కార్యదర్శి కిరణ్‌కుమార్ స్థానంలో కిశోర్ మంగళవారం విధుల్లో చేరారు. చామనపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ స్థానంలో బదిలీ అయిన మహేందర్‌రావు ఇంకా విధుల్లో చేరలేదు, ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఆరిఫ్ స్థానంలో మమత, బిల్ కలెక్టర్ రేణుక స్థానంలో శ్రీనివాస్ విధుల్లో చేరారు. పశుసంవర్ధక శాఖలో చేగుర్తి జేవీవో సంధ్యారాణి స్థానంలో అర్చన, మొగ్దుంపూర్ జేవీవో సమ్మయ్య స్థానంలో ఆరిఫ్ అహ్మద్, నగునూర్ జేవీవో రాజు స్థానంలో సమ్మయ్య, బొమ్మకల్‌లో వెటర్నరీ అసిస్టెంట్ లచ్చయ్య స్థానంలో విజయలక్ష్మి బదిలీపై వచ్చారు.

ఎంపీడీవో శ్రీవాణికి స్థానచలనం

శంకరపట్నం, జూలై 23: మండల పరిషత్ అభివృద్ధి అధికారి నల్ల శ్రీవాణి సాధారణ బదిలీల్లో భాగంగా వరంగల్ జిల్లా చెన్నారావుపేట్ ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. కాగా, ములుగు జిల్లా మంగపేట్ మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న గోల్కొండ కృష్ణ ప్రసాద్ శంకరపట్నం ఎంపీడీవోగా బదిలీపై వస్తున్నట్లు సమాచారం.

పెండింగ్ జీతాలు, ఇతర సమస్యలు పరిష్కరించండి

విద్యానగర్, జూలై 23: ప్రభుత్వ దవాఖాన కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ దవాఖాన వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో వైద్య విద్య సంచాలకులు డాక్టర్ వాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన డీఎంఈ కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో, కాంట్రాక్ట్ యాజమాన్యంతో మాట్లాడారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. సమస్య మరోసారి ఉత్పన్నమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్‌లో వైద్య విద్య సంచాలకులు డాక్టర్ వాణిని కలిసిన వారిలో ప్రభుత్వ దవాఖాన వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్, కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్ అధ్యక్ష, కార్యదర్శులు పి. అరుణ్, టి. కళావతి, ఉపాధ్యక్షురాలు పి. శారదా ఉన్నారు.

మత్తు పదార్థాల వ్యతిరేక పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, జూలై 23 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల పోస్టర్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ రావు, మైన్స్ అండ్ జియాలజీ సెక్రటరీ సురేంద్ర మోహన్ వేర్వేరుగా ఆవిష్కరించారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు, పునరావాస కార్యక్రమాలు చేపడుతుండడాన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో సాహితి ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు కుమార్, సంతోష్ కుమార్, సంఘం సభ్యులు మారుతి, శ్రీకాంత్, సజ్జన్, వేదాంతం పవన్ కుమార్ శర్మ, రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

ఇల్లందకుంట/ కరీంనగర్ రూరల్/ చొప్పదండి, జూలై 23: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ కమిషనరేట్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఇల్లందకుంట రైతు వేదికలో నిర్వహించిన హుజూరాబాద్ ఏడీఏ సునీత, ఏవో రజిత, ఏఈవోలు తిరుపతి, రాకేశ్, సంపత్, మమత, రైతులు పాల్గొన్నారు. కరీంనగర్ మండలం చామనపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌ను కరీంనగర్ ఏడీఏ రణాధీర్ రెడ్డి రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో ఏవో బీ సత్యం, ఏఈవో అనుజ్ఞ, స్వర్ణలత పాల్గొన్నారు. చొప్పదండి పట్టణంలోని రైతు వేదికలో ఏవో వంశీకృష్ణ, రైతులు వీసీలో పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలి

వీణవంక/ శంకరపట్నం/మానకొండూర్ రూరల్, జూలై 23: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వీణవంక, శంకరపట్నం, మానకొండూర్ మండల తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు.

పారమితలో వృత్తులపై అవగాహన

కమాన్‌చౌరస్తా, జూలై 23 : మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోషల్ సబ్జెక్ట్ పాఠ్యాంశంలో భాగంగా వృత్తులు అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ కులవృత్తులు, రంగాల్లో నిష్ణాతులైన 32 మంది ప్రముఖులు ఆయా వృత్తులు, రంగాల గురించి విద్యార్థులకు వివరించారు.

ఇంటింటా ఇన్నోవేటర్‌పై అవగాహన

చొప్పదండి, జూలై 23: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పమేలా సత్పతి సిబ్బంది ద్వారా మంగళవారం మండలంలోని జవహర్ నవోదయ, రుక్మాపూర్ సైనిక పాఠశాల విద్యార్థులకు ఇంటింటా ఇన్నోవేటర్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ స్వీయ నైపుణ్యాలను ఉపయోగించుకొని నూతన ఆవిష్కరణలు రూపొందించేలా వారు సూచనలు ఇచ్చారు.

ఎంపీడీవోకు పరామర్శ

కరీంనగర్‌రూరల్, జూలై 23: కరీంనగర్ ఎంపీడీవో సంజీవరావు తండ్రి సాంబయ్య ఇటీవల మృతి చెందగా, మంగళవారం ఓదెలలోని ఆయన నివాసంలో మాజీ సర్పంచులు పరామర్శించారు. ఇందులో మాజీ సర్పంచులు దబ్బెట రమణారెడ్డి, ఉప్పుల శ్రీధర్, జక్కం నర్సయ్య, రుద్ర రాము, మారుతి, రాజయ్య, మల్లారెడ్డి తదితరులున్నారు.

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ) Syndicate

కరీంనగర్-II (13300) శాఖ
డోర్ నం. 3-5-150/31, గాంధీ రోడ్,
కరీంనగర్-505001

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేదీ & సమయం: 28-08-2024న ఉ. 11.30 గం. నుండి మ. 12.30 గం. వరకు (అమ్మకం ముగిసేంత వరకూ ప్రతిసారీ 5 నిమిషాల కాలవ్యవధి గల అపరిమిత పొడిగింపులతో).
బయానా దాఖలుకు చివరి తేదీ: 27-08-2024న సా. 4.00 గం. వరకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన, కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ తెలిపిన విధంగా **కెనరా బ్యాంక్**కు బకాయిలు + దానిపై వర్తించని వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలను రాబట్టుకొనుటకు **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదికన"** విక్రయించబడతాయని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

రుణగ్రహీత పేరు: ఇరుగురాల పద్మ (రుణగ్రహీత), దూలికట్ట గ్రామం, ఎలిగెడ మండలం, కరీంనగర్-500025, **హామీదారు/ తనఖాదారు: సిహెచ్ అశోక్ కుమార్ (హామీదారు)**, తండ్రి వెంకటయ్య, ఇం.నం. 6-78, బొమ్మకల్, కరీంనగర్ -505001.

మొత్తం బకాయి: రూ. 16,83,587.94 **(పదహారు లక్షల ఎనభై మూడు వేల ఐదు వందల ఎనభై ఏడు రూపాయల తొంబై నాలుగు పైసలు మాత్రమే)** మరియు వర్తించని వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలు, ఖర్చులు, వ్యయాలతో సహా.

స్థిరాస్తి వివరణ: సబ్‌జిల్లా మరియు రిజిస్ట్రేషన్ జిల్లా కరీంనగర్ అధికార పరిధిలో, కరీంనగర్ రెవెన్యూ మండలం మరియు జిల్లా, బొమ్మకల్ గ్రామం & గ్రామపంచాయతీ వద్ద గల, కరీంనగర్ సబ్‌రిజిస్ట్రార్‌తో, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం.6950/2013 ప్రకారం, 410 చ.గజాలు విస్తీర్ణం ప్లాట్‌లో నిర్మించబడిన డోర్ నెం.5-27 కలిగిన, ఎ ఆర్.సి.సి రూఫ్డ్ గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు యావత్తు, **సరిహద్దులు: ఉత్తరం:** అత్తాపురం దుర్గయ్య ఖాళీ ప్లాట్, **దక్షిణం:** 20 అడుగుల వెడల్పు రోడ్, **తూర్పు:** 20 అడుగుల వెడల్పు రోడ్, **పడమర:** 20 అడుగుల వెడల్పు రోడ్.

రిజర్వు ధర: రూ. 34,42,500/- బయానా: రూ. 3,44,250/-

ఆస్తిని 23-08-2024న ఉ.10.00గం. నుండి సా. 4.00 గం. మధ్య తనిఖీ చేసుకోవచ్చును.

గమనిక: రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, కరీంనగర్-II పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డిపాజిట్ చేయాలి లేదా **కెనరా బ్యాంక్, A/c. No. 209272434, IFSC కోడ్: CNRB0013300 అకౌంట్ జమకు** 27-08-2024న **లేదా ఆలోగా సా. 4.00 గం. వరకు** RTGS/ NEFT/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా డిపాజిట్ చేయాలి.
*బ్యాంక్‌కు తెలిసిన తాకట్టు రుణభారాలు లేవు.
*ఆస్తి బ్యాంక్ లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనత క్రింద కలదు.
అమ్మకం సవివరమైన నియమ నిబంధనల కోసం కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ **(www.canarabank.com)** లో ఏర్పాటు చేసిన "ఇ-ఆక్షన్" లింక్‌ను రిఫర్ చేయండి లేదా ఏదేని పని రోజున కార్యాలయ వేళలలో **బ్రాంచి మేనేజర్, కెనరా బ్యాంక్, కరీంనగర్-II శాఖ** వారిని సంప్రదించవచ్చును, ఫోన్ నం. **9448117115**

తేదీ: 23-07-2024, ప్రదేశం: వరంగల్ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్